క్లుప్తంగా

నేడు కొత్తపేటకు విశారదన్ మహారాజ్

కొందుర్గు: కేశంపేట మండలం కొత్తపేటకు శుక్రవారం ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ రానున్నారని ఆ పార్టీ కొందుర్గు మండల అధ్యక్షుడు డప్పు రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగ జాగృతి సంఘం, ధర్మ సమాజ్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తపేటలో నిర్మించిన భారత రాజ్యాంగ స్థూపాన్ని విశారదన్ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల ధర్మసమాజ్ పార్టీ, మాదిగ జాగృతి సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు శంకర్‌పల్లి తాత్కాలిక పీఎస్ ప్రారంభోత్సవం



అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్ స్టేషన్

శంకర్‌పల్లి: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ప్రారంభించనున్నట్లు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్ స్థానంలోనే కొత్త స్టేషన్ భవనాన్ని నిర్మిస్తుండడంతో.. అంబేడ్కర్ భవన్‌లో తాత్కాలిక స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ పోలీసులు, ఫిర్యాదుదారులకు అన్ని రకాల సదుపాయాలను సమకూర్చామని స్పష్టంచేశారు.

ఆకట్టుకుంటున్న వీధి నాటకం


కళాకారులతో నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో శ్రీమల్లిఖార్జున స్వామి బైలు నాటకం ఆకట్టుకుంటోంది. వీధి నాటకాలను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు తదితరులు కళాకారులను అభినందించి, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గ్రామస్తుల సహకారంతో కళలను పరిరక్షించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

రంజాన్ సదుపాయాల కల్పనకు వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

షాద్‌నగర్: రంజాన్ మాసంలో తగిన సదుపాయాలు కల్పించాలని మైనార్టీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. మార్చి 1నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతుందని, పట్టణంలోని మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా కాలనీల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రార్థనా స్థలాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని విన్నవించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, ముబారక్, కబీర్, జాఫర్ ఉన్నారు.

ప్రజాసేవే ఫౌండేషన్ లక్ష్యం

ఇబ్రహీంపట్నం: ప్రజాసేవే ఫౌండేషన్ లక్ష్యమని, నిరుపేదలకు 'సపోర్ట్ ఫర్ లైఫ్ ఫౌండేషన్' అండగా నిలుస్తుందని ఫౌండేషన్ చైర్మన్ బి.యాదగిరి అన్నారు. వినోబానగర్‌లోని మాతా పితరుల సేవా సదనంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్స్, నిత్యవసర సరకులను గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివరాత్రిని పురస్కరించుకుని ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా వృద్ధులకు సరకులు పంపిణీ చేశామని తెలిపారు. అంతేగాక సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు, దివ్యాంగులకు విద్య, వైద్య సేవలందిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయరంగ ప్రగతి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతి నిధులు వెంకటేశ్వరరావు, క్రాంతి కిరణ్, బా లకృష్ణ, శ్రవణ్‌కుమార్, డాక్టర్ కె.పర్వతరెడ్డి, జీవీ వీరభద్రరావు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మైదానంపై నిర్లక్ష్యపు నీడలు

- అభివృద్ధికి నోచుకోని మినీ స్టేడియం
- పదహారేళ్లుగా ప్రహరీకే పరిమితం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


మొయినాబాద్‌లో ప్రహరీకే పరిమితమైన మినీస్టేడియం

మొయినాబాద్: మినీ స్టేడియంపై నిర్లక్ష్యపు నీడలు కొనసాగుతున్నాయి. క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు వారిలోని నైపుణ్యాలకు పదును పెట్టేందుకు పదహారేళ్ల క్రితం నిర్మించిన మినీ స్టేడియం ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని.. గ్రామానికో మైదానం ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మొయినాబాద్‌లోని మినీ స్టేడియం పదహారు సంవత్సరాలుగా ప్రహరీకే పరిమితమై.. అభివృద్ధికి నోచుకోక అందుబాటులోకి రావడం లేదు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధిపై ప్రసంగాలు చేసే అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని పట్టించుకోవడంలేదు.

గోడలకే సరిపోయిన నిధులు

మొయినాబాద్ మండల కేంద్రం సమీపంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం 2009లో అప్పటి ప్రభుత్వం పెద్దమంగళారం రెవెన్యూలోని సర్వేనంబర్ 356, 359లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. స్టేడియం నిర్మాణానికి అప్పట్లోనే రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటితో చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు గోడకే సరిపోవడంతో అక్కడికే పనులను ఆపేశారు.

గేట్లు ఎత్తుకుపోయిన దుండగులు

ఎలాంటి అభివృద్ధి జరగకపోవడంతో స్టేడియం ఆటలకు అనుకూలంగా లేదు. అక్కడక్కడ ఉన్న గుంతలను సైతం చదును చేసే దిక్కు లేకుండా పోయింది. క్రీడాకారులకు భవనం, చూసేవారి కోసం పెవిలియన్ వంటి ఊసే లేదు. ఫలితంగా క్రీడాకారులెవరూ అటువైపు వెళ్లడం లేదు. ఫలితంగా లక్షలు వెచ్చించిన స్టేడియం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. స్టేడియానికి ఏర్పాటు చేసిన గేట్లను ఏడాది క్రితం గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లడం గమనార్హం.

ప్రైవేటు మైదానాల్లో ప్రాక్టీస్

ప్రభుత్వ స్టేడియం అందుబాటులోకి రాకపోవడంతో చాలా మంది క్రీడాకారులు ప్రాక్టీస్ కోసం ప్రైవేటు మైదానాలకు వెళ్తున్నారు. దీంతో ఇటీవలి కాలంలో మండల పరిధిలో వీటి సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇందులో ఆడుకునేందుక ఒక్కో ఆటగాడు ఏటా రూ.5 వేల నుంచి రూ.10 వేలు చెల్లిస్తున్నారు. డబ్బులు కట్టలేని పరిస్థితిలో ఉన్న పేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులు ఆటలకు స్వస్తి చెబుతున్నారు. మినీ స్టేడియాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారైనా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు. ఇప్పటి వరకు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న స్టేడియం ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో చేరింది. కనీసం మున్సిపల్ అధికారులైనా దీని అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



మొయినాబాద్‌లోని మినీస్టేడియం ప్రహరీకే పరిమితమైంది. దీంతో చాలా మంది క్రీడాకారులు ప్రైవేటు గ్రౌండ్లకు వెళ్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, అన్నిరకాలుగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలి.

– దర్గ నరేందర్, చిలుకూరు

స్పోర్ట్స్ అథారిటీకి నివేదిస్తాం



మినీ స్టేడియం నిరుపయోగంగా ఉందని ఇప్పుడే తెలిసింది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. ఈ విషయాన్ని స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు నివేదించి, అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తాం.

– మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్, మున్సిపల్ కమిషనర్, మొయినాబాద్

భక్తిభావాలను అలవర్చుకోవాలి

- జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల
- అల్వాలలో ఉత్సాహంగా బండలాగుడు పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న విశాల

కేశంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ భక్తిభావాలను అలవర్చుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల అన్నారు. మండల పరిధిలోని అల్వాలలో కొనసాగుతున్న రామలింగేశ్వర భ్రమరాంబిక ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బండలాగుడు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పోటీలను ప్రారంభించి, రైతులు, క్రీడాకారులను అభినందించారు. పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, పల్లె అనంద్‌కుమార్, తాండ్ర శ్రావణ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఉచిత వైద్య శిబిరం


చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతరలో ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్య శిబిరం

- ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి
- వైఆర్‌జీకే సూపర్‌వైజర్ రాములు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల: మండల కేంద్రంలోని జాతరలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఆర్‌జీకే సూపర్‌వైజర్ రాములు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో భాగంగా గురువారం హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వారంరోజుల పాటు కొనసాగే ఉత్సవాల్లో భక్తుల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంప్ ప్రారంభించామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే చికిత్సలు చేయించుకోలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. అనంతరం హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు అనంతలక్ష్మి, అనిత, సునీత, ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


మేడిపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ నవీన్

- మొయినాబాద్ ఎస్ఐ ముజాఫర్‌అలీ
- క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం


సురంగల్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ ముజాఫర్‌అలీ

మొయినాబాద్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మొయినాబాద్ ఎస్ఐ ముజాఫర్‌అలీ అన్నారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి సురంగల్‌లోని గాండ్ల సంతోష్‌కుమార్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 40 జట్లు ఇందులో పాల్గొన్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో గురువారం ఉదయం వరకు పోటీలు కొనసాగాయి. విజేతగా నిలిచిన చేవెళ్ల జట్టుకు రూ.5 వేల నగదుతో పాటు షీల్డు, రెండో స్థానంలో నిలిచిన తోలుకట్ట జట్టుకు రూ.1,500 నగదు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకుడు మేకల మల్లేశ్, నాయకులు సీతారెడ్డిరెడ్డి, ప్రభుయాదవ్, రాజుయాదవ్, జగన్, విజయ్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వీరు, పాండుయాదవ్,జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మేడిపల్లి మాజీ సర్పంచ్ కామని నవీన్ అన్నారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పది జట్లు పాల్గొన్న టోర్నీలో కె.విజయ్ టీం మొదటి బహుమతి, జి.మహేశ్ జట్టు రెండో బహుమతి గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజర్లు బి.అంజి, కె.రాజు, ఎ.శ్రీకాంత్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పరిమళం

- వైభవంగా కొనసాగిన శివరాత్రి వేడుకలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం


నందిగామ: నర్సప్పగూడలో అన్నదానం


షాబాద్ మండలం సాయిరెడ్డిగూడలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు


కొందుర్గు: రావిర్యాల సోమలింగేశ్వరాలయంలో శకటోత్సవం


షాబాద్ మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలో మల్లన్న కళ్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు

షాబాద్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ అనుబంధ గ్రామమైన సాయిరెడ్డిగూడలో గురువారం మల్లన్న, కేతమ్మల కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు బోనాలు, జల కడవలతో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్‌ల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణ సంబరాలు కొనసాగాయి. దామర్లపల్లి, పెద్దవేడు, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, మాచన్‌పల్లి, నాగర్‌కుంట, హైతాబాద్, మద్దూర్ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన, మాజీ ఎంపీటీసీ పొన్న జయమ్మ, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరికొంపై అన్నదానం

నందిగామ: అన్నదానం చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని బీజేపీ సీనియర్ నాయకుడు కాట్న సురేందర్ అన్నారు. శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని గురువారం నర్సప్పగూడలోని వెంకటగిరికొండపై తన సొంత డబ్బులతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి గేటు అందజేస్తానని ప్రకటించారు.

వైభవంగా శకటోత్సవం

కొందుర్గు: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల సోమలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాలు గురువారం ముగిశాయి. వేడుకల్లో భాగంగా దేవాతామూర్తుల ఊరేగింపు, శివపార్వతుల కళ్యాణం, లింగోద్భవం నిర్వహించారు. గురువారం నిర్వహించిన మహా నైవేద్యం, శకటోత్సవం భక్తులను కట్టిపడేశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం చేపట్టారు.

రోడ్లతోనే గ్రామాల ప్రగతి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రహదారుల విస్తరణకు సహకరించాలని ప్రజలకు పిలుపు

నందిగామ: రోడ్లతోనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుగ్గోనిగూడలో జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో డ్వాక్రా భవనం, బండోనిగూడలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, చేగూరులో సీఆర్ఆర్ నిధులు రూ.18 లక్షలతో సీసీరోడ్లు, వెంకమ్మగూడలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, మామిడిపల్లిలో సీఆర్ఆర్ నిధులు రూ.24 లక్షలతో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలకు సంబంధించిన పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్లు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న డబుల్ రోడ్ల నిర్మాణం, విస్తరణకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం తన స్వగ్రామమైన వీర్లపల్లి శివాలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీటీసీలు దేపల్లి కుమార్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, నాయకులు నవీన్ గౌడ్, పసుల బుచ్చయ్య, రాజగోపాల్‌గౌడ్, చిందం నర్సింహ, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మామిడిపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సమాజ శాంతికి దైవ కార్యక్రమాలు దోహదం

ఆమనగల్లు: దైవ కార్యక్రమాలు.. సమాజ శాంతికి దోహదపడతాయని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నర్సింహా దేవాలయ ఆవరణలోని పురాతన శివాలయాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో పునర్నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి ఆలయాన్ని వెంకటేశ్, నాగసాధువులతో కలిసి జైపాల్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాగరణ కార్యక్రమంలో భాగంగా శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ సర్పంచ్ లలిత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహా, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ట్రస్టు సభ్యులు డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్, బుచ్చిబాబు, సుల్తాన్ పాల్గొన్నారు.

డీఐ రమేశ్‌నాయుడు బదిలీ.. ఉపేందర్‌కు బాధ్యతలు


రమేశ్‌నాయుడు

చేవెళ్ల: చేవెళ్లలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న జి.రమేశ్‌నాయుడు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రమేశ్‌నాయుడుకు మియాపూర్‌లో పోస్టింగ్ ఇవ్వగా.. ఆయన స్థానంలో సీహెచ్ ఉపేందర్‌కు బాధ్యతలు అప్పగించారు.

పన్ను సకాలంలో చెల్లించండి

తుర్కయంజాల్: ఇంటి పన్ను సకాలంలో చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి కోరారు. గురువారం పుర కార్యాలయంలో పన్ను చెల్లించడానికి వచ్చిన ఓ వ్యక్తిని ఆయన అభినందించారు. పన్ను చెల్లించకుండా తప్పించుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని కలిగి ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ జాతరలో భాగంగా కుంచం పెంటయ్య సన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచితన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తుల ఆకలి తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు పెంటయ్య, శివకుమార్, నరేశ్, నాయకులు దేవర వెంకట్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆగిరెడ్డి పాల్గొన్నారు.

ఏడుపాయలలో దుర్గమ్మ దర్శనం

ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


చేవెళ్లలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య దాతలు,నాయకులు.